వైఎస్ఆర్

జీవన్‌ధార-2 పెన్షన్ ప్లాన్‌ను ఆదరించాలి

కడప అర్బన్ : సరళమైన పాలసీ నిబంధనలతో, రెగ్యులర్ పద్ధతిన ప్రీమియం చెల్లించే అవకాశాలున్న, గ్యారెంటీడ్ పెన్షన్ (యాన్యుటి) ప్లాన్ జీవన్ ధార- 2 పాలసీని ఆదరించాలని ఎల్ఐసి మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందర్రావు పిలుపునిచ్చారు. సోమవారం ఈ నూతన పాలసీ బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల్లో, వృత్తుల్లో ఉన్నవారికి, నామమాత్రపు ఫ్యామిలీ పెన్షన్ లభిస్తున్న వారికి, తల్లిదండ్రులకు మరింత ఆకర్షణీయమైన పాలసీ అని అన్నారు. ప్రస్తుత ఎల్ఐసి పాలసీదారులకు, సామూహిక బీమా లబ్ధిదారులకు ఇతరులతో పోల్చినప్పుడు ఈ పాలసీ కింద మెరుగైన యాన్యుటీ రేట్లు ఎల్ఐసి ఇస్తుందని అన్నారు. వైద్య పరీక్ష అవసరం లేకుండా 20 నుంచి 80 సంవత్సరాల వయసున్న వారికి పాలసీ అందుబాటులో ఉందని అన్నారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, ఇతర మేనేజర్లు సత్య శ్రీనివాస్, రాము నాయక్, మహీధర్, గురునాథాచారి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై అంగన్వాడీల ఆగ్రహం

ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

కడప పాతబస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న అంగన్వాడీలు

- రాస్తారోకో, పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా
- 42వ రోజూ కొనసాగిన సమ్మె
- 24న రాష్ట్ర బంద్

అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 42 రోజులుగా చేస్తున్న సమ్మెకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఈనెల 21న చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టారు. ఈనేపథ్యంలో పోలీసులు వారికి ఎక్కడికక్కడ అరెస్టు, గృహ నిర్బంధం, నోటీసులు అందజేశారు. ప్రభుత్వ నిర్బంధన చర్యలను నిరసిస్తూ సోమవారం కడప నగరంలో సిఐటియు, అంగన్వాడీలు రాస్తారోకో నిర్వహించారు. ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. బి.మఠంలో చలో విజయవాడకు వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 24న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి.

జమ్మలమడుగు : దీక్షా శిబిరంలో అంగన్వాడీలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని 43 రోజులుగా సమ్మె చేస్తుంటే పట్టించుకోకపోవడం దారుణమని, చలో విజయవాడకు తరలి వెళుతున్న నాయకులను, కార్యకర్తలను, ఆయాలను ప్రభుత్వం పోలీసుల చేత అరెస్టు చేయించడం దుర్మార్గమని సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మిదేవి, బి.లక్ష్మిదేవి అన్నారు. సోమవారం పాతబస్టాండ్‌లో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరడం తప్పా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీలను మగపోలీసుల చేత అరెస్టు చేయించడానిన తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అర్ధరాత్రి రైలు దింపి పోలీసు స్టేషన్‌కు తరలించడం రాజ్యాంగ ఉల్లంఘనేనని చెప్పారు. అంగన్‌వాడీలతో పెట్టుకు ఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాలేదని గుర్తు చేశారు. జగన్‌కు జైలు, ఇంటికి పరిమితం చేస్తామని హెచ్చ రించారు. కార్యక్రమంల సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు, నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** స్థానిక ఐసిడిఎస్ కార్యాలయ ఆవరణంలో అంగన్వాడీలు నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం 42వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి.విజయ్ మాట్లాడుతూ విజయవాడలో జరుగుతున్న ఆమరణ దీక్షకు మద్దతుగా వెళ్తున్న మహిళలను అర్ధరాత్రి అరెస్టు చేయడం చాలా దుర్మార్గమని అవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో కచ్చితంగా జగన్‌మోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు భాగ్యమ్మ, లక్ష్మీదేవి , కులాయమ్మ , విద్యార్థి యువజన సంఘల బాధ్యుడు వినయ్ కుమార్, సిఐటియు ఆటో స్టాండ్ అధ్యక్షుడు ఆదాం మరియు అంగన్వాడీ వర్కర్స్ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్):** చలో విజయవాడ కార్యక్రమానికి ప్రయివేట్ బస్సులలో వెళ్తున్న అంగన్వాడీలను పోరుమామిళ్ల వద్ద ఆపడాన్ని ప్రొద్దుటూరులో ఎక్కడెక్కడ అంగన్వాడీ వర్కర్లను అడ్డుకోవ డాన్ని, నాయకుల ఇళ్ల వద్ద పోలీసులను కాపాలాగా ఉంచడాన్ని నిరసిస్తూ సోమవారం ప్రొద్దుటూరు తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద అంగన్వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల టెర్మినేషన్ లెటర్ ఇచ్చి తొలగిస్తామని చెప్పడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. వెంటనే యూనియన్ లీడర్ల ఇంటి వద్ద ఉన్న పోలీసులను తిరిగి పోలీస్ స్టేషన్ లకు పిలిపించుకున్న తర్వాత ఆందోళన విరమించారు. మద్దతుగా సిఐటియు కార్యదర్శి విజయ్ కుమార్ మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్ అధ్యక్షులు చంటి కోశాధికారి రాఘవ ఆటో యూనియన్ కార్యదర్శి శేఖర్ ఐద్వాజిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం పట్టణ అధ్యక్షులు వెంకటసుబ్బమ్మ రాములమ్మ లక్ష్మీదేవి డివైఎఫ్ఐ నాయకులు డేవిడ్ అంగన్వాడీ యూనియన్ నాయకులు సువార్తమ్మ సునీత పద్మ సుబ్బలక్ష్మి నాగవేణి కృష్ణవేణి లక్ష్మీదేవి అంగన్వాడి వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** . సోమవారం అంగన్వాడీకార్యకర్తలకు మద్దతుగా అక్రమ అరెస్టులను ఖండిస్తూ స్థానిక పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని 42 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం చలించగపోగా వారిపై నిరంకుశంగా కర్కశంగా వ్యవహరించే పద్ధతిలో కోటి సంతకాలతో ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వాలని ఛలో విజయవాడకి అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిస్తే వారి పై ప్రభుత్వం ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టులు, నిర్బంధాలు చేయడాన్ని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటిగా తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. అర్ధరాత్రి అంగన్వాడీ వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యని సిపిఎం పట్టణ కార్యదర్శి జి. ఏసుదాసు అన్నారు.

బి.కోడూరు ఎస్ఐని సస్పెండ్ చేయాలి

బద్వేల్ : అంగన్వాడీల కార్యకర్తలపై అనుచితంగా ప్రవర్తించిన బి. కోడూరు ఎస్ఐ జయరాములను వెంటనే సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలియజేశారు. వారి మద్దతుగా సిఐటియు, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొని మాట్లాడారు. చలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను బస్సును దొంగల్లాగా, తీవ్ర వాదుల్లాగా వెంబడించి గుంటూరు సమీపంలో అడ్డుకొని తిరిగి బద్వేలు ప్రాంతానికి తరలించారని చెప్పారు. తరలించే క్రమంలో కనీసం మూత్ర విసర్జనకు కూడా వెళ్లనివ్వకుండా, మంచినీరు తాగేందుకు ఆహారం తినేందుకు అవకాశం కల్పించడం పోవడంతో, అంగన్వాడీ కార్యకర్తలు రాధమ్మ, రత్తమ్మ అనారోగ్యానికి గురయ్యారని వాపోయారు. పైగా ఎస్ఐ మహిళలను అసభ్య పదజాలంతో దూషించారని, సర్ది చెప్పాలని ప్రయత్నించిన సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు ఆంజనేయుల పై దురుసుగా ప్రవర్తించి, గెంటి వేసే ప్రయత్నం చేయడం సరైనది కాదని వాపోయారు. ఎస్పి స్పందించి ఎస్ఐపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బద్వేల్: అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

అరెస్టు దారుణం : సిపిఎం

చాపాడు : సమస్యల పరిష్కారం కోసం ఐదు రోజులుగా విజయవాడలో ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న వారిని పరామర్శించడం కోసం వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. మైదుకూరు, ప్రొద్దుటూరు అంగన్వాడీ కార్యకర్తలను మార్కాపురం, మల్లేపల్లి ప్రాంతాల దగ్గర వాహనాలు ఆపి పోలీసులు అరెస్టులు చేసి అర్ధరాత్రి సమయాల్లో స్టేషన్‌కు తీసుకెళ్లి నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. మైదుకూరులో అంగన్వాడీ కార్యకర్తలను రాత్రి పూర్తిగా స్టేషన్‌లో నిర్బంధించడం హేయనీ యమన్నారు. మైదుకూరుకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలను మల్లేపల్లి దగ్గర వాహనాన్ని అడ్డగించిన పోలీసులు మైదుకూరు డిఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చారన్నారు.

మహిళలను నిర్బంధించడం అన్యాయం : సిఐటియు

చలో విజయవాడకు వెళ్తున్న అంగన్వాడీలను అర్ధరాత్రి 12 గంటల సమయంలో మైదుకూరు పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లి నిర్బంధించడం అన్యాయమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ ప్రకటనలో తెలిపారు. వెంటనే జిల్లా ఎస్పి జోక్యం చేసుకొని మహిళలను ఇంటికి పంపాలని వారు కోరారు. బస్సులలో, రైళ్లలో పోయే వారిని ఎక్కడికి ఎక్కడ నిర్బంధించడం, వెనక్కి తీసుకొచ్చి పోలీస్ స్టేషన్‌లలో పెట్టడం దారుణమన్నారు.

వైసిపి పతనం తప్పదు

బద్వేలు : అంగన్వాడీలపై నిర్బంధాలు విధించి అక్రమ అరెస్టులు చేయడం సరైన పద్ధతి కాదని, అలా చేస్తే రాష్ట్ర ప్రభుత్వానికి పతనం తప్పదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు **అక్రమ అరెస్టులను ఖండించాలి..** అంగన్వాడీల అక్రమ అరెస్టులను ప్రతి ఒక్క రూ ఖండించాలని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ ఉపాధ్య క్షులు షేక్, జహంగీర్‌బాష , సిపిఐ బద్వేల్ పట్టణ కార్య దర్శి పెద్దల్లపల్లి బాలు, సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పఠాన్ చాంద్ బాషా ,కాంగ్రెస్ పార్టీ బద్వేల్ ముస్లిం, మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ పేర్కొన్నారు. తక్షణమే అరెస్టు చేసిన అంగన్వాడీలను , వారి నాయకత్వాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిర్బంధం సరికాదు : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : అంగన్వాడీల అక్రమ నిర్బంధం సరి కాదని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం ఓబులేసు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని 42 రోజులుగా శాంతియుత పద్ధతిలో సమ్మె చేస్తున్నారని తెలిపారు. చలో విజయవాడకు బయలుదేరుతున్న అంగన్వాడీ నాయకత్వాన్ని, కార్యకర్తలను అక్రమంగా అర్ధరాత్రి 12 వరకు పోలీస్ స్టేషన్‌లో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

రాష్ట్ర బంద్ జయప్రదం చేయండి..

రాష్ట్రవ్యాప్తంగా 1,05,000 మంది అంగన్వాడీ ఉద్యోగులు 42 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా పెద్ద ఎత్తున నిర్బంధం ప్రయోగిస్తున్నదని, దీనిని నిరసిస్తూ ఈనెల 24న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం అంగన్వాడీ లపై ఎస్మా ప్రయోగించడం, పోరాటాన్ని అడ్డుకోవడం, అక్రమంగా అరెస్టు చేయడం, పెద్ద ఎత్తున నిర్బంధం ప్రయోగించడం సర్వీసు నుంచి తొలగిస్తున్నట్టు ఆదేశాలు ఇవ్వడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. రాష్ట్రవ్యాప్త బంద్‌కు ప్రజానీకం పెద్ద ఎత్తున సహకరించి విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

తొలగింపు అన్యాయం : ఎస్‌టియు

పోరుమామిళ్ల : తమ న్యాయమైన డిమాండ్ల సాధనకోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమం చేస్తున్న అంగన్వాడీలను విధుల నుంచి తొలగించడం అన్యాయమని ఎస్‌టియు రాష్ట్రకౌన్సిలర్ పి.రమణారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తొలగింపు ఉత్తర్వులను ఉపసంహరించుకుని, వారి సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలన్నారు.

అంగన్వాడీ వర్కర్ల అరెస్టు దుర్మార్గం : కాంగ్రెస్

కడప : అంగన్వాడీ వర్కర్లను, హెల్పర్లను వైసిపి ప్రభుత్వం పోలీసులచే అరెస్టు చేయించడం దుర్మార్గమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ వర్కర్లను అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్మిక విభాగం తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

తొలగింపు ఉత్తర్వులు చట్టబద్ధంగా చెల్లవు : అఖిలపక్షం

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీల టర్మినేషన్ ఉత్తర్వులు చట్టబద్ధంగా చెల్లవని, కలెక్టర్లపై ఎన్నికల కమిషన్ చర్యలు లాగే ప్రభుత్వ సిఎస్ పై హైకోర్టు చర్యలు తప్పవని, సివిల్ సర్వెంట్లు ప్రభుత్వాల మెహర్బానీ కోసం తప్పులు చేస్తున్నారని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు సోమవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో అఖిలపక్ష పార్టీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 1,6,000 మంది అంగన్వాడీలు 42 రోజులుగా కనీస వేతనాలు, ఇతర బెనిఫిట్స్ కోసం సమ్మె చేస్తుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వల ఉమ్మడి పరిధిలో ఉన్న ఐసిడిఎస్ అంగన్వాడీ కార్యకర్తలను 'టెర్మినేషన్ చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ఏకపక్షంగా, జవాబుదారీతనం విస్మరించి ఉత్తర్వులు విడుదల చేసినట్లుగా తెలుస్తోందని పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు, ఐసిడిఎస్ అధికారులకు తెలియజేసి వెంటనే డ్యూటీలో చేరకపోతే వారి ఉద్యోగాలను తొలగించాలని బెదిరింపులు చేస్తున్నట్లుగా తెలియవస్తోందని చెప్పారు. దీన్ని అఖిలపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వ ఉత్తర్వులు వెనక్కి తీసుకుని, అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కారానికి చర్చలకు పిలవాలని, లేకుంటే వైసిపి ప్రభుత్వ పతనానికి 'అంగన్వాడి సమ్మె' పునాది వేస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఉపయోగించే 'ప్రభుత్వ నల్ల చట్టం ఎస్మా' ప్రయోగించడం చట్టబద్ధంగా చెల్లదని తెలిపారు. అంగన్వాడీ వర్కర్ల టర్మినేషన్ ఆర్డర్లపై సంతకాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఈ చర్యలు చట్టం తెలిసి కూడా చట్టాన్ని ఉల్లంఘించడమేనని, దీనికి పరిహారం, ప్రతికూల చర్యలు హైకోర్టు, సుప్రీంకోర్టులో తీర్పుల ద్వారా మూల్యం చెల్లించుకోక తప్పదని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరిప్రసాద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎ.సత్తార్, జనతాదళ్ పార్టీ (సెక్యులర్), జిల్లా అధ్యక్షులు ప్రతాపరెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకులు డాక్టర్. శ్రీనివాసులు, లోక్‌సత్తా పార్టీ జిల్లా నాయకులు కృష్ణ, సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు రమణయ్య, జనతాదళ్ (యునైటెడ్), బి.ఎస్.పి, ఆర్.ఎస్పి. ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఐ.ఎన్.సుబ్బమ్మ, రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి , ఓబులేసు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

మహిళలదే పైచేయి

- 13 అసెంబ్లీల్లోనూ ప్రథమ స్థానం
- కడపలో జిల్లాలో 8,25,177, అన్నమయ్యలో 7,13,326 మంది మహిళా ఓటర్లు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా విడు దలైంది. ఆయా జిల్లాల రెవెన్యూ అధికార యంత్రాంగాలు కడప జిల్లాలోని ఏడు, అన్నమయ్య జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సుదీర్ఘ పరిశీలన, వడపోతల అనంతరం సోమవారం ఓటర్ల జాబితాను విడుదల చేసింది. కడప జిల్లాలో 16,16,509 మంది, అన్నమయ్య జిల్లాలో 14,02,808 మంది ఓటర్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. కడప జిల్లాలో 8,25,177 మంది, అన్నమయ్య జిల్లాలో 7,13,326 మంది మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నట్లు తేలింది. కడప జిల్లాలోని కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేల్ అసెంబ్లీ నియోజక వర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం. కడప జిల్లాలో కడప అసెంబ్లీ పరిధిలో 2,74,226 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 13,3,890 మంది పురుషులు, 14,0248 మంది స్త్రీలు, 88 మంది ట్రాన్స్‌జెండర్స్ 77 మంది పురుషులు, తొమ్మిది మంది పురుష, స్త్రీ సర్వీసు ఓటర్లు ఉన్నారు. బద్వేల్ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో 2,17,769 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,08, 673 మంది పురుషులు, 1,09,089 మంది స్త్రీలు, ఏడు గురు ట్రాన్స్‌జెండర్స్, 945 మంది, 26 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. పులివెందు అసెంబ్లీ పరిధిలోని 2,27,453 మంది ఓటర్లలో 1,10,829 మంది పురుషులు, స్త్రీలు 1,16,605 మంది, 19 మంది ట్రాన్స్‌జెండర్స్, 398 మంది పురుష సర్వీస్, ఐదుగురు స్త్రీ సర్వీసు ఓటర్లు ఉన్నారు. కమలాపురం అసెంబ్లీ పరిధిలోని 2,00, 222 మంది ఓటర్లలో 98,037 మంది పురుషులు, స్త్రీలు 1,02, 151 మంది స్త్రీలు, 34 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. జమ్మలమడుగు అసెంబ్లీ పరిధిలోని 2,40, 835 మంది ఓటర్లలో 1,17,067 మంది పురుషులు, స్త్రీలు 1,23,751 మంది, ట్రాన్స్‌జెండర్స్ 17 మంది ఉన్నారు. సర్వీసు ఓటర్లు పురుషులు 262 మంది, స్త్రీలు ఆరుగురు ఉన్నారు. ప్రొద్దుటూరు అసెంబ్లీ పరిధిలో 2,46,726 మంది ఓటర్లలో పురుషులు 1,19,680 మంది,1,26,995 మంది స్త్రీలు, ట్రాన్స్‌జెండర్స్ 141 మంది ఉన్నారు. మైదుకూరు అసెంబ్లీ పరిధిలోని 1,02,932 మంది, స్త్రీలు 1,06,338 మంది, ట్రాన్స్‌జెండర్స్ ఎనిమిది మంది, సర్వీసు ఓటర్లు 267 మంది, స్త్రీలు 10 మంది చొప్పున నమోదు చేసుకోవడం గమనార్హం. అన్నమయ్య జిల్లాలో రాజంపేట అసెంబ్లీ పరిధిలో 2,37,028 మంది ఓటర్లలో 1,15,594 మంది పురుషులు, 1,21,424 మంది స్త్రీలు, 10 మంది ట్రాన్స్‌జెండర్స్, సర్వీసు ఓటర్లలో పురుషులు 158 మంది, స్త్రీలు 05 మంది ఉన్నారు. రైల్వేకోడూరు రిజర్వ్డ్ నియోజకవర్గంలో 2,01,544 మంది ఓటర్లలో పురుషులు 99,351 మంది, స్త్రీలు 1,02,176 మంది, 17 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉండగా, సర్వీసు ఓటర్లలో 112 మంది పురు షులు, 04 ఉన్నారు. రాయచోటి అసెంబ్లీ పరిధిలో 2,50,374 మంది ఓటర్లలో 1,23,836 మంది పురుషులు, 1,26,512 మంది స్త్రీలు, 26 మంది ట్రాన్స్‌జెండర్స్, సర్వీసు ఓటర్లలో పురుషులు 253 మంది, స్త్రీలు 01 ఉన్నారు. తంబళ్లపల్లి అసెంబ్లీ పరిధిలోని 2,21,647 మంది ఓటర్లలో పురు షులు 1,09, 219 మంది, స్త్రీలు 1,12,418 మంది, 10 మంది ట్రాన్స్‌జెండర్లు, సర్వీసు ఓటర్లలో పురుషులు 175, స్త్రీలు 01 ఉన్నారు. పీలేరు అసెంబ్లీ పరిధిలో 2,32,435 మంది ఓటర్లలో పురుషులు 1,14,022 మంది, స్త్రీలు 1,32,399 మంది, ట్రాన్స్‌జెండర్లు 16 మంది, సర్వీసు ఓటర్లలో పురుషులు 396 మంది, స్త్రీలు 06 మంది ఉన్నారు. మదనపల్లి అసెంబ్లీ పరిధిలో 2,59,780 మంది ఓటర్లలో పురుషులు 1,27,324 మంది, స్త్రీలు 1,32,399 మంది, ట్రాన్స్‌జెండర్లు 57 మంది ఉన్నారు. ఇందులో సర్వీసు ఓటర్లు పురు షులు 168, స్త్రీలు 07 మంది ఉన్నారు. ఏదేమైనా కడప, అన్నమయ్య జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం.



25న జాతీయ ఓటర్ల దినోత్సవం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు విజయవంతం చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లాలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పనలో భాగంగా జిల్లాలో జరిగిన వివిధ కార్యకలాపాలు, ఫారం 6, 7, 8 లకు పరిష్కారాలు, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన కనీస సౌకర్యాలైనా విద్యుత్, ఫర్నిచర్, తాగునీరు, మురుగు దొడ్లు, ర్యాంప్ నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా స్థానికంగా సహకారం అందించాలన్నారు. ఇవిఎం ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు మల్లికార్జున (వైసిపి), లక్ష్మణరావు (బిజెపి), హరిప్రసాద్, జిలాని బాషా(టిడిపి), కానుగ దానం(బిఎస్‌పి), పాల్ సుధాకర్ (ఐఎన్‌సి), చంద్రశేఖర్ (సిపిఎం), కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీనియర్ సివిల్ జడ ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను జడ్జి పరిశీలించారు. అనంతరం సోమవారం రిమ్స్ ఆవరణలో గల వన్ స్టాప్ సెంటర్ ను జడ్జి సందర్శించారు. ఆపదలో ఉన్న మహిళలు వన్ స్టాప్ సెంటర్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటక చిత్రాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 25న జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పర్యాటక ప్రదేశాల చిత్రాలతో కూడిన పోస్టర్‌ను ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా ఆవిష్కరించారు. కవితా విద్యా సాంస్కృతిక సేవా సంస్థ చైర్మన్ అలపర్తి పిచ్చయ్య చౌదరి రూపొందించిన పోస్టర్‌లో రాయలసీమ ప్రాంతంలోని వివిధ పర్యాటక ప్రదేశాలు వాటి ప్రాశస్త్యం వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, అరుణ కుమారి, నాగవేణి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు పాల్గొన్నారు.

పేరు తొలగించాలని ఫిర్యాదు

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని పైడి కాలువ గ్రామంలోని ఆర్‌బికె భవనంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం ఫలకంలో మాజీ సర్పంచ్ ఓ వి. సుబ్బారెడ్డి పేరు తొలగించాలని శీతోర్‌పల్లి టిడిపి నాయకులు కూలూరు ప్రతాప్ రెడ్డి సోమవారం ఎంపిడిఒ జయశ్రీకి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపిడిఒ ఆర్‌బికె బవనాన్ని పరిశీలించి మాజీ సర్పంచ్ అనే పేరును తొలగించే చర్యలు చేపడతామన్నారు.

ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప రైల్వేస్టేషన్‌లో రోడ్డులో పాలెం నరసింహులు సంబంధించిన పూర్వీకుల ఆస్తిని మోసపూరితమైన వీలునామ సృష్టించిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, మహిళల పైన దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు బి.నారాయణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు డబ్ల్యూ.రాము, బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి సగిలి గురప్ప, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీకృష్ణదేవరా హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి ఆర్ వి ప్రసాద్ రావు కోరారు. బాధితులను సోమవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ మోస పూరిత వీలునామాపై జిల్లా నాలుగవ అదనపు జిల్లా కోర్టులో భాగ పరిష్కారం సంబంధించిన కేసు నడుస్తుందని తెలిపారు. అక్కకు సంబంధించిన ఆస్తి దక్కకుండా గౌతమ్, చంద్రకాంత్ మోసపూరితంగా అక్రమంగా ఆస్తి కాజేయాలని కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు. ఇంటి మీదకు వచ్చి గొడవ చేస్తున్నారని, ఈ విషయంపై కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయమని పోలీస్ స్టేషన్ ఆశ్రయిసే వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదని చెప్పారు. వారి వెంట సీనియర్ జర్నలిస్ట్ అంజి తోపాటు మరికొంత మంది పాల్గొన్నారు.

చెన్నూరు సిఐగా పార్థసారథి

చెన్నూరు : సిఐగా పార్థసారథి సోమవారం బాధ్యతలు చేపట్టా పట్టారు. ఇక్కడ పని చేస్తున్న చిన్న పెద్దయ్య విఆర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు నుంచి ఇక్కడికి బదిలీ అయిన పార్థసారథి బాధ్యతలు చేపట్టారు.

వల్లూరు ఎస్ఐగా వెంకటరమణ

వల్లూరు : స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప పోలీస్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మట్కా జూదం మద్యపానానికి మండల ప్రజల దూరంగా ఉండాలన్నారు.

31న కడప జిల్లాలో షర్మిల పర్యటన

ప్రజాశక్తి-కడప : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన వై.ఎస్ షర్మిల ఈ నెల 31వ తేదీన కడప జిల్లాలో పర్యటించనున్నట్లు డిసిసి అధ్యక్షులు శ్రీరాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టిన తరువాత కాంగ్రెస్ పార్టీలో, పార్టీ శ్రేణుల్లో, నాయకుల్లో, కార్యకర్తల్లో, అభిమానుల్లో ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని నింపేందుకు వస్తోందన్నారు. ఆమె పర్యటనకు సంబంధించి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాట్లలో సన్నద్ధమయ్యామన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం సిగ్గుచేటు

ప్రజాశక్తి-చెన్నూరు

కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టింది కాంగ్రెస్ పార్టీ అని ఆలాంటి పార్టీని విమర్శించడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొట్టి పాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉండి 135 సంవత్సరాలు అనుభవం కలిగిన పార్టీపై మనుగడ లేని పార్టీ అనడం సిగ్గుచేటు అన్నారు. తన గత చరిత్ర తెలుసుకోవాలని మాట్లాడితే బావుండని చెప్పారు. సమాజానికి తెలియని రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ ఆయన్ను జడ్‌పిటిసి సభ్యుడిగానూ, జడ్‌పి వైస్ చైర్మన్‌గాను, కడప నగర తొలి మేయర్‌ను చేసింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు డిపాజిట్ కూడా రాకుండా చేయడం తథ్యమన్నారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మను విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. నియోజకవర్గంలో వైసిపి కాంగ్రెస్ కాలగర్భంలో కలిసిపోతుందని చెప్పారు. సమావేశంలో చందూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సందని, పాలగిరి శివ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బిసిలతో భూపేష్‌రెడ్డి

టిడిపి పుట్టింది బడుగు, బలహీన వర్గాల్లోనే..

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

టిడిపి బడుగు బలహీన వర్గాల నుంచి పుట్టిందని ఆ పార్టీ జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి భూపేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జయహో బిసి సమీక్ష క్షేత్రస్థాయిలో బిసి సమస్యల గురించి వారి నుంచే నాయకులకు వివరించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారక రామారావు, చంద్రబాబు ఇద్దరూ బిసిలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వారి సంక్షేమానికి కృషి చేశారన్నారు. జగన్ ప్రభుత్వంలో బిసిల పట్ల చిత్తశుద్ధి కనపడలేదని విమర్శించారు. బిసిలందరూ ఏకమై సైకో ప్రభుత్వాన్ని పోగొట్టి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, బిసి సెల్ కార్యదర్శి కొండయ్య, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి సూర్య పెద్దిరాజు, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల కొండయ్య, మున్సిపాలిటీ పరిధిలోని బిసి నాయకులు పాల్గొన్నారు.

- రామరాజ్యంలో ప్రజలు సుఖంగా ఉండాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సి భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం మండల పరిధిలోని దేవ గుడి గ్రామంలో పట్టణంలోని పెద్దబజార్‌లో గల రామాలయంలో రామునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో సైకో జగన్ ప్రభుత్వం పోయి రామన్న రోజుల్లో రాముడు వంటి చంద్రన్న ప్రభుత్వం రావాలని కోరారు. ఆయనతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

'పుట్టా'ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి - ఖాజీపేట

అయోధ్యలోని రామ మందిరం ఆలయం విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి టిడిపి మైదుకూరు నియోజకవర్గ బాధ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ రెండు లక్షల 50 వేల రూపాయల మొత్తాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు.

లక్ష్మిరెడ్డి నుంచి నగదు అందుకుంటున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఈ మొత్తాన్ని ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో సోమవారం కమిటీ సభ్యులకు అందించారు. మండల టిడిపి అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి సుధాకర్ యాదవ్ ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆసన చిన్నయ్య, సాలె పిచ్చి నాయుడు, నిగినని పుల్లయ్య నాయుడు, దొరవారి రాముడు, బాలినేని గంగయ్య, నల్లగొండు వీరయ్య, గొనె శ్రీను, ముత్తురు చిన్న వెంకటసుబ్బయ్య, దేవరాజు, సంజీవ రాయుడు, తేలు లక్ష్మయ్య, వంకర సుబ్బరాయుడు, వంకర లక్ష్మయ్య, నిగినం బాల నాయుడు, ముత్తురు వెంకటేష్యం, తొండూరు సుధాకర్, ముత్తురు రమణ, నల్లగొండు పెంచలయ్య, నిగినం విజయ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

టిడిపి నాయకులపై అక్రమ కేసులు దుర్మార్గం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

వైసిపి నాయకులు చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న పోలీసులు టిడిపి నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు చర్యలకు నిరస నగా సోమ వారం స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఆయన ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ డబ్బుల బాకీ విషయమై చిన్న గొడవ జరిగితే టిడిపి నాయకుడు దస్తగిరి ఫిర్యాదు తీసుకోకుండా ఆయనపైనే కిడ్నాప్, హత్యాయత్నం కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. 2022 అక్టోబర్ 13న వైసిపి నాయకులు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, గురునాధరెడ్డి, గరిశపాటి లక్ష్మిదేవిలపై నమోదైన 307 కేసులో ఇంత వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. వీరు ముగ్గురు బహిరంగంగా తిరుగుతున్నారన్నారు. మహిళా ఎస్‌ఐపై రాళ్లదాడి జరిగితే విచారించి నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. సెబ్‌స్టేషన్‌లో పోలీస్ ఉన్నతాధికారిని సాక్షాత్తూ ఎమ్మెల్యే దూషిస్తే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. వీరిపై సుమోటోగా కేసు నమోదు చేయాలని ప్రవీణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జబీవుల్లా, ఇవి సుధాకర్‌రెడ్డి, బండి భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ మహమ్మద్‌గౌస్, శ్రీదేవి, బోగా లక్ష్మిదేవి పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక కుమ్మరవీధిలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సోమవారం అయోధ్య రామ మందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్టాపన సందర్భంగా శాలివాహన సంఘం, గొటూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కడప రోడ్డులో పలువురు భక్తులు పానకం పంపిణీ చేశారు. కుమ్మర వీధిలో పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో గొటూరు నాగభూషణం, శ్రీధర్, గొటూరు సుబ్బరాయుడు, ప్రభాకర్ రెడ్డి, శేఖర్, శాలివాహన సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని పలుచోట్ల పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగరిగుట్టలోని ఆంజనేయస్వామి గుడిలో అయోధ్యలో జరగబోయే బాలరామ ప్రాణప్రతిష్టాపన సందర్భంగా మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న, నాయకులు పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, సంపత్, నాగరాజు, ప్రజలు పాల్గొన్నారు.

చక్రాయపేట : అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆంధ్ర అయోధ్య దశరథ మహారాజు స్వామి దేవస్థానంలో వేడుకలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి, వీరభద్రస్వామి, దేవాలయ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి అడ్వకేట్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గండిలో కూడా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిరు. పెద్ద ఎత్తున అన్నప్రసాద వినియోగం చేశారు. నాగలగుట్టపల్లి హైస్కూల్ విద్యార్థులు కోలాటం ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర, వీరభద్ర దేవస్థానం కమిటీ సభ్యులు, గండి క్షేత్రం చైర్మన్ కావలి తేజ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా శ్రీరామనామ జపంతో ఆలయాలు మారుమోగాయి. సింహాద్రిపురంలో శ్రీరాముని ప్రత్యేక రథంలో బ్యాండ్ మేళాలతో అంగరంగ వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. చాలా గ్రామాల్లో అన్న ప్రసాద వినియోగం చేశారు.

జమ్మలమడుగు రూరల్ : పట్టణం, మండలంలోని ప్రతి గ్రామంలో రామాలయం వద్ద ఆలయ కమిటీ అన్నదానం చేశారు. గండికోటలోని అభయాంజనేయ స్వామి దేవాలయం, పి.బొమ్మేపల్లిలో అన్నదానం చేశారు. మరి కొన్నిచోట్ల పానకం పంపిణీ చేశారు. గండికోట ప్రజలు సోమవారం జమ్మలమడుగు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువతతో కలిసి దాదాపు వంద బైకులలో ర్యాలీ చేశామని సర్పంచ్ కె.గురుఈశ్వర్ తెలిపారు.

కంది పంటకు మబ్బుల బెడద

సాగులో ఉన్న కంది పంట

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కంది పంటకు మబ్బుల బెడద అధికమైంది. పది రోజులుగా మబ్బులు వెంటాడడంతో దిగుబడి తగ్గుతుందేమోనని రైతుల్లో ఆందోళన నెలకొంది. దీర్ఘకాలిక పంటగా కంది సాగు చేయడం రైతులకు పరిపాటి. ఈ క్రమంలో కొంతమంది రైతులు మిశ్రమ పంటగా మరికొంతమంది పూర్తిస్థాయిలో కంది వేశారు. పూత దశలో మబ్బులు మొదలయ్యాయి. దీంతో పూత మగ్గిపోవడం కనిపిస్తోంది. సంక్రాంతి పండుగకు కందులు ఇంటికి చేరాల్సి ఉంది. అయితే ప్రతి ఏటా సంక్రాంతి మబ్బులు కమ్ముకోవడం సహజమే. కానీ ఈ దపా ఎక్కువ రోజులు మబ్బులు వెంటాడాయి. దీంతో దిగుబడి కూడా సగానికి సగం తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు రైతులు సూచన ప్రాయంగా చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఈ దపా సాగు చేసిన వేరుశనగ, పత్తి ప్రధాన పంటలు ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ఇక ప్రధాన పంటగా సాగు చేసే బుడ్డసెనగ పంటకు కూడా వాతావరణం అనుకూలించలేదు. ఇక ధనియాల పంట కూడా దాదాపు కనుమరుగైంది. దీంతో కంది పైనే ఆశలు నింపుకున్నారు. మబ్బులు వెంటాడడంతో రైతులు ఆశలు ఆవిరయ్యాయి. ఇలాంటి విపత్కర స్థితిలో కంది రైతులను ప్రభుత్వమే ఆదుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

బాధ్యతగా సేవ చేయాలి : ఎంపీ

- గండిక్షేత్రం ఆలయ చైర్మన్‌గా కృష్ణతేజ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - వేంపల్లె /చక్రాయపేట

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గండి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి నూతన పాలక మండలి సభ్యులు బాధ్యతగా సేవ చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సూచించారు. చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రంలో సోమవారం శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం నూతన పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారాన్ని దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా ఎంపీ అవినాష్‌రెడ్డి సమక్షంలో శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, రాసినేని మధు, ప్రధాన అర్చకుడు కేసరి స్వామితోపాటు మరికొంత మంది నూతన పాలక మండలి సభ్యులచే దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం పాలక మండలి సభ్యులు చైర్మన్‌గా వీరన్నగట్టుపల్లె గ్రామానికి చెందిన కావలి కృష్ణతేజను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ గండి దేవస్థానానికి నూతన పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకార చేయడం సంతోషంగా ఉందన్నారు. గండి అభివృద్ధికి సంబంధించి దాదాపు రూ.15 కోట్లతో పనులు జరుగుతున్నట్లు చెప్పారు. మూడు దశల్లో గండిని అభివృద్ధి చేసేందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు చెప్పారు. జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ గండి చైర్మన్ కృష్ణతేజ ఆధ్వర్యంలో పాలక మండలి సభ్యులు అభివృద్ధికి పాటుపడాలని కోరారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కావలి కృష్ణతేజ మాట్లాడుతూ అందరి సహకారంతో గండి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిఎం జగన్‌రెడ్డికి, ఎంపీ అవినాష్‌రెడ్డికి, వైసిపి ప్రజాప్రతినిధులకు,

ప్రమాణ స్వీకారం చేస్తున్న గండి నూతన పాలక మండలి సభ్యులు

పాలకమండలి సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కందుల ఎడ్యుకేషన్ గ్రూప్ చైర్మన్ కందుల చంద్రఓబుల్ రెడ్డి మాట్లాడుతూ గండి క్షేత్రంలో కందుల కుటుంబం ఆధ్వర్యంలో రూ.3 కోట్లతో కల్యాణ మండపం నిర్మించారన్నారు. త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చక్రాయపేట ఇన్‌ఛార్జి వైఎస్ కొండారెడ్డి, ఆడా చైర్మన్ గురుమోహన్, వేంపల్లె, మారెళ్లమడక సర్పంచులు రాచినేని శ్రీనివాసులు, నర్సింహులు, వేంపల్లె ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్రఓబుల్‌రెడ్డి, మాజీ గండి చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి, ఆలయ ఉప అర్చకులు రాజా రమేష్ అయ్యంగార్, మాచునూరు చంద్ర, పలువురు వైసిపి నేతలు, కార్యకర్తలు, దేవదాయ శాఖ అధికారులు, గండి క్షేత్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉనికి కోల్పోయిన పిసిసి అధ్యక్షులు షర్మిల : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆంధ్ర రాష్ట్ర ప్రజల గుండెలను రెండుగా చీల్చి ఆంధ్ర రాష్ట్రంలో పూర్తిగా ఉనికిని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణాలో రాజకీయ ఉనికిని కోల్పోయిన షర్మిల అధ్యక్షురాలైనంత మాత్రాన వైసిపికి వచ్చిన నష్టం ఏమీ లేదని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్నారు. వైసిపి నాయకుడు పోరెడ్డి నరసింహారెడ్డి ఇంట్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షర్మిల రాజకీయ ప్రాబల్యానికి తాపత్రయ పడుతోందన్నారు. షర్మిల జగనన్న చేతిలో ఉన్నంత వరకు పదునైన బాణమని, మరొకరి చేతిలోకి వెళ్లాక పదును

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

తగ్గిన బాణం అన్నారు. చంద్రబాబు, సోనియా, రాహుల్‌గాంధీ చేతిలో కీలుబొమ్మ అయ్యారన్నారు. వైయస్ కుటుంబంతోపాటు రాష్ట్ర ప్రజలను సర్వనాశనం చేసిన సోనియా పెంపుడు కూతురుగానే షర్మిలను చూస్తాం గాని ఇప్పటి నుండి వైఎస్‌ఆర్ బిడ్డగా చూడబోమన్నారు. పేదరికాన్ని ఆలింగనం చేసుకొని దాని నిర్మూలనకు పేదల లోగిళ్లకు రూ.2లక్షల 50వేల కోట్లను చేర్చిన జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి కనిపించకపోవడం షర్మిల అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నాడు-నేడుతో పాఠశాలు, ఆర్‌బికెలు, రూ.24వేల డ్వాక్రా రుణాల చెల్లింపు, సమగ్ర రైతు ప్రయోగశాలలు కనిపించలేదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. షర్మిలమ్మ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారన్నారు. ఇకపై షర్మిల చేసే ప్రతి విమర్శకు సమాధానం ఉంటుందని రాచమల్లు అన్నారు.

డాక్టర్ శివజ్యోతికి యంగ్ సైంటిస్ట్ అవార్డు

యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకుంటున్న శివజ్యోతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో నిర్వహించిన 6వ అంతర్జాతీయ అగ్రికల్చర్ సదస్సులో ఎర్రగుంట్లకు చెందిన సీనియర్ రిపోర్టర్ శిరిగిరెడ్డి సదాశివరెడ్డి కుమార్తె డాక్టర్ శిరిగిరెడ్డి శివజ్యోతికి యంగ్ సైంటిస్ట్ అవార్డు దక్కింది. ఆమె గోపవరంలోని పశువైద్య కళాశాలలో పరాన్న జీవశాస్త్ర విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఈనెల 19 నుండి 21వ తేదీ వరకు ఒరిస్సా రాష్ట్రంలోని కటక్‌లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పశువులలో వచ్చే 'మెదడుకు సంబంధించిన జబ్బులు-రక్త పరాన్న జీవులు' అనే అంశంపై చేసిన పరిశోధనలుకుగానూ ఎన్‌ఆర్‌ఆర్‌ఐ సంస్థ యంగ్ సైంటిస్ట్ అవా ర్డును అందించింది. ఈ సదస్సులో సుమారు 300 మంది వివిధ దేశాల సైంటిస్టులు పాల్గొన్నారు. ఐసిఎఆర్, ఎన్‌ఆర్‌ఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ ఎకె నాయక్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా శివజ్యోతి మాట్లాడుతూ గేదెలలో రక్త పరాన్న జీవుల వల్ల కొత్త లక్షణాలు వస్తున్నాయని, వాటిని త్వరితగతిన గుర్తిస్తే జబ్బుకు తగిన చికిత్స సులభతరమని వివరించారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి సీనియర్ రిపోర్టర్ సదాశివారెడ్డి మాట్లాడుతూ అవార్డు దక్కడంతో ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుందని సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎన్నో అవార్డులు వచ్చాయని, కానీ యంగ్ సైంటిస్ట్ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. ఇంతటి అవార్డు దక్కించుకున్న అమ్మాయి ఎర్రగుంట్ల వాసి కావడం గర్వకారణంగా ఉందని స్థానిక ప్రముఖులు పలువురు ప్రశంసించారు.

మాదిగలకు సమన్యాయం చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు మాదిగలకు అన్యాయం చేస్తున్నాయని, రాష్ట్రంలో ఎస్సీ అసెంబ్లీ రిజర్వుడు స్థానాలు 29లో మాదిగలకు తక్కువ సీట్లు కేటాయిస్తున్నారని రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 4 పార్లమెంటు స్థానాల్లో మాదిగకు తక్కువ సీట్లు కేటాయిస్తున్నారని, మాదిగల జనాభా ప్రాతికపదికన మే మెంతో - మాకు అంతవాట కావాలని కోరారు. 29 అసెంబ్లీ స్థానాలలో 15 అసెంబ్లీ సీట్లు, 4 పార్లమెంటు స్థానాల్లో 2 స్థానాలు రాజకీయ పార్టీలు మాదిగలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. రాయలసీమ జిల్లాల 11 అసెంబ్లీ స్థానాలలో మాదిగలకు సమన్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి జి. వరదరాజులు, పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తోట వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు

సమావేశంలో మాట్లాడుతున్న సువర్ణరాజు

ఎదురూరు బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు వీరపు శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టం సుబ్బారావు, జిల్లా కార్యదర్శి కె.వెంకటసుబ్బయ్య, పాలెం భరత్, పులివెందుల ఇన్‌ఛార్జి కమ్మటి నాగేంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : ఎంపీ

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన నివాసం వద్దకు వచ్చిన ప్రజలతో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రజలతో మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి

ఎంపీకి అర్జీలు అందిస్తున్న ప్రజలు

జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చిన్నా, ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నిన్నా జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉన్నారన్నారు. అన్ని స్థానాలు గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముందుకు వెళుతున్నారని తెలిపారు. అంతకుముందు ఆయన నివాసం వద్దకు వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్క రించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఆయనకు అర్జీలను అందజేశారు.

లే అవుట్లకు పంచాయతీ అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంచాయతీ అనుమతి లేకుండా అనధికారికంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇఒపిఆర్‌డి వీరభద్రుడు, ముద్దనూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ బోనం సరళ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పంచాయతీ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనధికారంగా ఏర్పాటు చేసిన లే అవుట్లలో ఇంటి నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. అన్నమయ్య డెవలప్ మెంట్ అథారిటీ ద్వారా అనుమతి పొందిన తర్వాత ఆయా గ్రామ పంచాయతీ నుండి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని వారు కోరారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, నాయకులు

సొంత నిధులతో ఆలయ అభివృద్ధి హర్షణీయం

ప్రజాశక్తి - ఖాజీపేట

అయోధ్యలోని రామమందిరం ఆలయ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పూసల కొట్టాలు గ్రామంలోని రామాలయం అభివృద్ధికి సొంత నిధులతో పనులు చేపట్టడం హర్షణీయమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. పుల్లూరు పంచాయతీ రహమత్‌ఖాన్‌పల్లెకు చెందిన మండలం వైసిపి నాయకులు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి తన సొంత నిధులతో ఆలయ ధ్వజస్తంభం, ఆలయ ప్రహరీ నిర్మాణానికి ముందుకు రావడం గర్వ కారణమన్నారు. ఆ మేరకు ఎమ్మెల్యే ఆలయ ప్రహరీ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండలం కన్వీనర్ మురళిమోహన్‌రెడ్డి, మం డలం కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, వీరారెడ్డి, హాఫిజుల్లా, సచి వాలయం కన్వీనర్ గోపాల్‌రెడ్డి, కొండారెడ్డి, కోరా చంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి వ్యాసరచన పోటీల్లో తన ప్రతిభను చూపాలని ఎంపిడిఒ సంపతి దివిజ కోరారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'వేంపల్లె గురించి నా మాటల్లో' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను ఎంపిడిఒ పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గణతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకుని 6 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వేంపల్లెలోని బాలికల, బాలుర, ఉర్దూ పాఠశాల విద్యార్థులతోపాటు వీరన్నగట్టుపల్లె, తాళ్లపల్లె పాఠశాలలకు చెందిన 43 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు కేటగిరిల వారీగా ఈనెల 26న బహుమతులు ప్రదానం చేస్తామని ఎంపిడిఒ చెప్పారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

ఆరోగ్యశ్రీ కార్డులు వెంటనే పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధి దారులకు వెంటనే పంపిణీ చేయాలని అడిషనల్ డైరెక్టర్ కెవిఎన్ఎస్ అనిల్ కుమార్ ఆదేశించారు. సోమవారం సంఘం వీధిలో ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అనిల్‌కుమార్ తనిఖీ చేశారు. వాలంటీర్లు పంపిణీ చేస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులపై ప్రజలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.5 లక్షల నుండి రూ.25 లక్షల వరకు వైద్యం చేయిం చుకోవచ్చు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టిందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ కెఎస్ ఖాజామొద్దీన్, తాళ్ళపల్లె వైద్యులు స్వాతిసాయి, నిజాముద్దీన్ , హెల్త్ ఎడ్యు కేటర్ షఫీ వున్నిసా బేగం, సిహెచ్ఒ, ఎఎన్ఎంలు, వాలంటీర్లు, ఆశాలు పాల్గొ న్నారు.

జీపుల నూతన స్టాండ్ ఏర్పాటు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక కడప రోడ్డులో ప్రయివేట్ జీప్, కార్ల శాశ్వత జీప్ స్టాండ్‌ను సోమారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. శాశ్వత జీపు స్టాండ్ లేదని స్థానిక డ్రైవర్లు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్థలాన్ని మంజూరు చేయాలని కోరారు. ఆ మేరకు వారు స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జి పార్నపల్లి కిషోర్, డ్రైవర్ సంఘం నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

హ్యాండ్‌వాష్ స్టేషన్ ప్రారంభం

పులివెందుల రూరల్ : పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో హ్యాండ్ వాష్ స్టేషన్‌ను మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని ప్రజలు చేతులు శుభ్రం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. ఏవైనా తిన్నుబండారాలు తినేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కునేందుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి, సంపత్, మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల సమీపంలో నూతనంగా పట్టణ ప్రగతి యూనిట్ కింద పేపర్ ప్లేట్స్ తయారు చేసే కేంద్రాన్ని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్,రాష్ట్ర సివిల్ సప్లయ్ గంగాధర్‌రెడ్డి, మెప్మా పీడీ వై సురేష్ రెడ్డి, ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెమినా జీవనాపాధి కోసం చిన్నపాటి పరిశ్రమ ఏర్పాటుకు మెప్మా ద్వారా రూ.2.60 లక్షలు రుణమిచ్చామని, సబ్సిడీ కింద రూ.30 వేలు పోతుందన్నారు. మిగిలిన మొత్తాన్ని కంతుల వారీగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మహిళలను లక్షాధికారి చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాల్లో ఇది ఒకటి అన్నారు. ఇలాంటి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ మొత్తానికి 0.50 పైసలు వడ్డీతో చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, సీఎంఎం, రాజేశ్వరి, సిఒ నాయుడు, నాగన్న, ఆర్పీలు అరుణ, తులసి, గౌరీ, హసీనా, రాజకుల్లాయమ్మ, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నగదు పట్టివేత

ప్రజాశక్తి - కొండాపురం

సోమవారం కొండాపురం పోలీసులు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వాహనం నుండి ఎలాంటి ఆధారంలేని రూ.9,70,000 స్వాధీనం చేసుకున్నట్లు ట్రైనీ డిఎస్పి శ్రీకాంత్, కొండాపురం ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఈ డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. సదరు నగదు సీజ్ చేసి ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు.

మట్కా బీటర్లు అరెస్టు

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీరాంనగర్ కాలనీ సమీపంలో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు సిఐ చాంద్ బాషా తెలిపారు. వారివద్ద నుండి రూ.23,700 డబ్బును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం మట్కాపై సమాచారం రావడంతో ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, తిరుపాల్ నాయక్ సిబ్బందితో దాడులు చేసినట్లు తెలిపారు. కొండయ్య, యోగాంజనేయులు అనే వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పులివెందుల రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం తరలిస్తున్న శ్రీనివాసులు అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు సిఐ చెప్పారు.